


# వొద్దన్నానా?

గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

"**అమ్మా,** పులుసులో పోపు మాడినట్టుగా ఉందే!"

"మాడటమా! నేను పెట్టిన పోపు ఎంతనిరా! రెండు శనగ బద్దలే గదా వేశాను!"

"అయితే ఆ ఒద్దలే మాడాయి."

"చూడ్రా, అసలు వాటి రంగే మారందే!"

"అదీ కథ—పచ్చి గింజల వాసనన్న మాట!"

"ఏడిశావ్! మరి ఈ మినపగింజలు ఎట్లా ఎర్రబడ్డా యంటావు?"

"సరే! బెల్లం వేశావు, అవునా?"

"గోలీకాయంతే గదరా నే వేసించి!"

"చింతపండు కొత్తదా, పాతదా?"

"కొత్తది అప్పుడే ఎక్కడొచ్చింది? పాతదే!"

"అదుగో అదీ గోల! పురుగుల పండు వేసుంటావు—రుచి మారిపోయి చచ్చింది!"

"రెండో రకం సరుకు మనింట్లో వాడగానువ్వెప్పుడైనా చూశావాఅసలు?"

"మంచినీళ్ళలో డి. డి. టి. కలిసిందా?"

"ఇవ్వా ళసలు పంపుల రానే రాందే! బావినీళ్ళు వాడాను వంటకి."

"పెదవేగి కరివేపాగ్గాని వేశావా?"

"నువ్వూ, మీ బావా వాళ్ళ దొడ్లో క్రికెట్టాడారుగా, నాయనా. దెబ్బకి కరేపచెట్టు చచ్చూరుకుందని మరునాడే మామయ్యొచ్చి చెప్పాడు."

"పోనీ, కొత్తిమెర... కొత్తిమెర వేసుంటావ్! చెప్పేయ్!"

"ఇదిగో పులుసంతా కలుపుతున్నాను. కొత్తిమెర రెమ్మ కనిపిస్తే ఛీ అను పడతాను."

"మరేంటే గోల! ఏదో వాసన! ఛీ, ఛీ. ఇది పులుసా, ఫాస్ఫారిక్ ఆసిడా!"

"ఏం లేదురా, నాన్నా. రెండు పుదీనా ఆకులు తరిగివేశానంతే సువాసన కోసం."

"ఏంటీ, పుదీనా ఆకా! అదన్న మాట ఈ చెత్తవాసన! పులుసక్కర్లేదు. మజ్జిగ పొసెయ్."

"ఒక్క గరిటె పోసుకుని చూడ్రా! ఎంతో రుచిగా ఉందని మీ నాన్నగారు మరీ మరీ పోయించుకుని తాగేరు."

"పోనీ అరిచేతిలో పోయించుకుని రుచి చూడు, బాబూ!"

"ఒద్దని చెపితే నీ క్కాదూ! మజ్జిగ పోస్తావా, లేచి పొమ్మంటావా?"

"ఇస్స్! బావకి రుచి చూపిద్దామని తెచ్చాను. మా దొడ్లోని ఈ రెండాకులూ తీసుకో, అత్తయ్యా అని చెప్పి ఇచ్చిపోతే వేశాను కానీ, లేకపోతే నాకు మాత్రం ఆ ఆకుల మీద మోజా పాడా! ఎప్పుడన్నా వాడాను కనకనా!"

"ఎవరు?"

"ఎవరా—నీ మరదలు! పెదవేగి మామయ్య కూతురు. స్కూలు కెడుతూ రిక్షా దిగి ఇచ్చి పోయింది."

"మరా మాట ముందే చెప్పలేదే!"

"ఇప్పుడు చెప్పాగా!"

"ఫూ. నువ్వన్నీ ఇట్లాంటి పన్లే చేస్తూంటావ్! అరిచేతిలో అరగరిటెడు పొయ్యి. ఫూ. ఏదో ఉందిలే. అట్లా కొసిరి కొసిరి పోస్తావేంటి? కొంచెం అన్నం పెట్టి పోస్తే మాత్రం వొద్దన్నానా! ఫూ. పొయ్యి!"

"ఒద్దు!"

*